
# మల్లేషు - మంగతాయారు



టైము ఒంటిగంట. బయట ఎండ ఫెళ్ళుమని కాస్తోంది. పెనిమిటికోసం ఇంకా ఎదురు చూడడం శుద్ధ దండగ అనుకుని గబగబా నాలుగు మెతుకులు కతికి మంచంమీద నడుంవాల్చింది మంగతాయారు.

అంతలోనే కాలింగ్‌బెల్ ఖంగుమంది.

'మహానుభావుడికి ఇప్పుడు తీరికైనట్లుంది' వళ్లు విరుచుకుంటూ వెళ్ళి తలుపుతీసింది.

ఎదురుగా బొచ్చుటోపి, జీన్‌ప్యాంటు. టీషర్టు కళ్ళకు నల్లద్దాలు ధరించిన వ్యక్తి.

వచ్చినవాడు అబ్బాయికోసం అనుకుని 'కిరణ్ లేడు' అంది తలుపువేస్తూ.

"ఆ సంగతి తెలుసులే" అంటూ దురుసుగా లోపలకు జొరబడ్డాడు అవతల వ్యక్తి.

వళ్ళు మండింది తాయారుకి. కోపం నషాళానికి అంటింది. "ఏంట్రా వాగుతున్నావ్?

ఇంట్లో ఎవరూ లేరని తెలిసేవచ్చావన్న మాట" అంటూ చెంప ఛెళ్ళుమని పించింది.

తాయారు కొట్టిన దెబ్బకి దిమ్మతిరిగిపోయింది మల్లేషుకి. "మొగుణ్ణిని కూడా చూడకుండా ఎంత దెబ్బ కొట్టావే! ఉన్నట్లుండి నీకేం రోగం వచ్చిందే" అంటూ చెంప తడుముకున్నాడు.

"అయ్యో! మీరుటండి... ఎవడో ఆకతాయి వెధవ అనుకున్నాను. ఎంత దెబ్బకొట్టాను. నా చెయ్యి పడిపోను" తనని తాను తిట్టుకుంటూనే "సర్కస్‌లో బఫూన్‌లా ఏవిటండి ఈ వేషం" అంది మెళ్ళోంచి పుస్తెలు తీసి కళ్ళకద్దుకుని.

తాయారు మాటలకు చిర్రెత్తుకొచ్చింది మల్లేషుకి. "వేషమా? ... పాడా... కొత్త డ్రస్సు ఎలా వుంది? ఈ గెటప్‌లో నేను యువకుడిలా లేనూ?!... ఇంకా డౌటెందుకు? అలా అనుకునే కదా నా చెంపవాయగొట్టింది" అన్నాడు నవ్వు తెచ్చిపెట్టుకుని.

"బావున్నాయండి మీ మాటలు. ఈ వయసులో పడుచు ముచ్చట్లా? ఎవరైనా చూసారంటే 'హవ్వ' నవ్విపోతారు. ముందావేషం మార్చండి" గభాలున పెనిమిటిని లోనికిలాగి దఢాలున గడియపెట్టింది మంగతాయారు.

"నువ్వెన్ని చెప్పు నేనీ డ్రస్సు తీయనంటే తీయను. అందరూ పనిగట్టుకుని నన్ను పెద్దాయన అనడం భరించలేకపోతున్నాను. పెద్దాయనట పెద్దాయన... ఎంత పెద్దైపో యానని?... నిండా యాభై ఐదేళ్ళు లేవు. అప్పుడే పెద్దాయన్ని చేసేసారు. జుట్టు నెరిసినంత మాత్రాన ముసలాణ్ణి అయిపోయినట్లేనా? మా తాతకి ముప్పై ఏళ్ళకే తల ముగ్గుబుట్టయింది. 'వారసత్వ సంపద" ఏం చేస్తాం? వృద్ధాప్యానికి చిహ్నం తలనెరవడమే అయితే ఇదుగో దానికి విరుగుడు 'వండర్‌ఫుల్ హెయిర్ డై'."

మల్లేషు మాటలకు నివ్వెరపోయింది తాయారు. ఈ మధ్య జరిగిన వరుస సంఘటనలే మల్లేషులో వచ్చిన ఈ ఆకస్మిక మార్పుకు కారణం. ఓసారి ఏదో పనిమీద ఊరెళ్ళేందుకు బస్సెక్కితే "పెద్దాయనకి కాస్త చోటివ్వు బాబు" అంటూ ఓ కుర్రాణ్ణి లేవగొట్టి తనని కూర్చోమన్నాడు కండక్టరు.

అతని మాటలకి వంటిమీద తేళ్ళు, జెర్రులు ప్రాకినట్లైంది మల్లేషుకి. "ఫరవాలేదు నేను నిలబడతాన్లెండి" అన్నాడు చిరాగ్గా. మరోసారి ఇలాగే కుటుంబ సమేతంగా దూరపు బంధువుల పెళ్లికి వెళ్ళినప్పుడు "తాతగారూ!... కూల్‌డ్రింక్ తీస్కోండి" అందో ముద్దుగుమ్మ స్మైలింగ్ ఫేస్‌పెట్టి. ఆ పిల్ల పిలుపుకు దాని పీక పిసికేయాలన్నంత కోపం వచ్చింది. అయినా తమాయించుకున్నాడు. సరిగ్గా అప్పుడే తన ఓల్డ్‌ఫ్రెండ్ కాంతారావు వచ్చాడు.

వాడిని చూడగానే "రండి అంకుల్" అంటూ సీటుచూపించింది. తను, వాడు ఒకే ఈడు వాళ్ళు. అయినా ఆ అమ్మాయి తనను తాతగారని, వాడిని అంకుల్ అని పిలవడం జీర్ణించుకోలేకపోయాడు. ఏం రాస్తాడో ఏంటో తెలీదుగాని కాంతారావుగాడి జుట్టెప్పుడూ నల్లగా తుమ్మెదలా ఉంటుంది. అందుకే వాడి వయసు కనిపించదు.

మొన్న జరిగిన సంఘటన..డబ్బు డ్రా చేద్దామని బ్యాంకువెళ్ళాడు మల్లేషు. ఎ.టి.ఎమ్ దగ్గర చాంతాడంత క్యూ ఉంది. ఏం చెయ్యాలో తోచక అసహనంగా అటుఇటు చూస్తూ నిలబడ్డాడు. అతడి అవస్థను గమనించిన ఓ అబ్బాయి "ఆ పెద్దాయనకి ఇక్కడ చోటిద్దామా" అన్నాడు ప్రక్కవాడితో.

"పెద్దల్ని గౌరవించడం మన సంప్రదాయం. పిలవండి" అన్నాడు.

ఆ మాటలు మల్లేషు చెవిలో పడనేపడ్డాయి. "నెవర్‌మైండ్, ఐకెన్ స్టాండ్ టిల్ మైటర్న్" సున్నితంగా అతడి ఆఫర్ని తిరస్కరించాడు. ఇక ఆ ఇన్సిడెంట్‌తో మనవాడు మరీ ఢీలా అయిపోయాడంటే నమ్మండి.

ఆ రాత్రి కంటిమీద కునుకులేదు. అద్దంలో ముఖాన్ని ఒకటికి పదిసార్లు చూసుకున్నాడు. పెద్దగా వృద్ధాప్యఛాయలు గోచరించడంలేదు. అయినా అంతా పని గట్టుకుని తనని పెద్దాయన్ని చేసేస్తున్నారు. దీనికేదో విరుగుడు వెయ్యాలి. ఏం చెయ్యాలో తోచక దిండుకేసి తలబాదుకున్నాడు. ఉక్రోషంతో జుట్టుపీక్కున్నాడు. చొక్కా చింపుకున్నాడు. ఏం చేసినా కసితీరడం లేదు.

❖ ❖ ❖

"తాయారు ! నా మంగతాయారూ.."

పెనిమిటి కేకకు "వస్తున్నానండి! ఎందుకా గావుకేకలు?" రుస రుసలాడుతూ దగ్గర కొచ్చింది మంగతాయారు.

"చూడు డియర్ నీ కోసం ఏం తెచ్చానో" అన్నాడు మల్లేషు పట్టుకొచ్చిన పాకెట్టు చేతికందిస్తూ.

"చీరా!?... అబ్బ, ఎన్నాళ్ళకి పట్టుచీర కొందామని బుద్ధిపుట్టిందండి మీకు? ఇవాళ ఏ ఊరు వండిందో ఏంటో" అంటూ ప్యాకెట్టు విప్పింది. అంతే ఒక్క సారిగా బిక్కచచ్చిపోయింది.

"అలా బిర్రబిగుసుకు పోయేవేంటే, నువ్వీ డ్రస్సులో పదహారేళ్ళ బాలాకుమారిలా ఉంటావు. అందుకే ఆరువందలైనా ఆలోచించకుండా కొన్నాను. ఎలా ఉంది?" తెగ

సంబరపడిపోతూ అడిగాడు మల్లేషు.

"ఏడిసినట్టుంది. మీకు పట్టిన పిచ్చి నాకూ పట్టిందనుకుంటున్నారా? నాతో ఒక్క ముక్కైనా చెప్పకుండా ఎందుకు పట్టుకొచ్చారీ డ్రస్సు. నేను తొడుక్కుంటాన నేనా?" శివమెత్తింది తాయారు.

"తొడుక్కుని తీరాలి. భర్తగా ఆజ్ఞాపిస్తున్నాను. ఈ ముతక చేనేత చీరలో నువ్వు బామ్మలా ఉంటే నీ మొగుణ్ణైన పాపానికి నన్నంతా 'తాతా' అంటున్నారు. నా బుల్లివి కదూ!... నా చిట్టివి కదూ!... నా మాట విని ఈ డ్రస్సు వేస్కోవే. పడుచుపిల్లలా ఉంటావు" అంటూ గెడ్డం పట్టుకున్నాడు.

"మీ తెలివి తెల్లారినట్లే వుంది. మీరెంతగా అరచి ఘీపెట్టినా నేను దీన్ని ముట్టనైనా ముట్టను డ్రెస్‌తీసి మొగుడి మొహాన విసిరికొట్టింది.

భార్య ఉగ్రరూపాన్ని చూసిన మల్లేషు చప్పున చప్పబడిపోయాడు. ఏమైనా అంటే కరుస్తుందేమో అనుకుని నోటికి తాళం వేసుకున్నాడు.

◆ ◆ ◆

మల్లేషు కాలు విరిగి మంచానపడ్డాడని తెలిసి స్కూలు స్టాఫంతా అతగాణ్ణి చూడటానికి తరలి వచ్చారు.

వచ్చినవాళ్ళు చూసిపోకుండా "కాలు ఎలా విరిగింది? డాక్టరేమన్నాడు?" అంటూ సవాలక్ష యక్ష ప్రశ్నలేసి అతడిని ఉక్కిరిబిక్కిరి చేసారు.

ఏదో చెప్పబోయింది మంగతాయారు.

ఆమె నోరు విప్పితే తన పరువు బజారున పడ్డం ఖాయం అనుకున్నాడో ఏమో నూతి దగ్గర కాలు జారిపడ్డానని అడ్డంగా ఓ బొంకు బొంకాడు మల్లేషు.

అప్పటికే విషయం చూచాయిగా తెలిసిన స్టాఫ్ ముసిముసిగా నవ్వుకున్నారు.

అసలు ఏం జరిగిందో మీకు చెప్పనే లేదు కదూ ! చెబుతాను వినండి. కాకినాడ వెళదామని ట్రైన్‌కోసం ప్లాట్‌ఫారం మీదకొచ్చాడు మల్లేషు. అప్పటికే రైలు కదిలింది. కుర్రాళ్ళు కొందరు పరుగెత్తుకుంటూ వెళ్ళి బండిక్యాచ్ చేసారు. వాళ్ళని హీరోల్ని చూసినట్లు చూస్తున్నారు ప్లాట్‌ఫారంమీద నిలుచున్న కాలేజీ అమ్మాయిలు. వాళ్ళపాటి స్టామినా తనకు ఉందని నిరూపించుకోవాలనుకున్నాడో ఏంటో గభాలున కోతిలా కంపార్ట్‌మెంట్లోకి దూకాడు. సొరకాయలా వున్న తన పొట్ట దూరేందుకు సందు దొరక్క పట్టుతప్పి జారి క్రిందపడ్డాడు. అదే పట్టాల మీద పడుంటే మటాష్ అయిపోయేవాడే.

బాధతో గిగిల తన్నుకుంటున్న మల్లేషుని హాస్పిటల్‌కి తీసుకెళ్లారు రైల్వే సిబ్బంది.

ఇరవై రోజుల పాటు బెడ్‌రెస్టు ఉండాలని చెప్పి కాలుకు ప్లాస్టరేసి ఇంటికి పంపించారు డాక్టర్లు. అదండి జరిగింది.

తనను పరామర్శించడానికొచ్చిన స్టాఫ్ వంక కృతజ్ఞతగా చూసాడు మల్లేషు.

టీచర్స్ ఎవరూ నోరు మెదపకపోయినా హెచ్.ఎమ్‌గారు మాత్రం ఊరుకోలేదు. "ఇది నీ స్వయం కృతమనే చెప్పాలి మల్లేష్. కుర్ర చేష్టలతో వయసు కప్పిపుచ్చాలనుకోవడం మూర్ఖత్వం. జుట్టు నెరిసేకొద్ది మనిషికి సమాజంలో గౌరవం పెరుగుతుంది. వృద్ధుల మీదున్న గౌరవభావంతోనే నేడు ప్రభుత్వం వారికెన్నో రాయితీలు కల్పిస్తోంది. ఏ ఆధారం లేనివారికి పించన్లు. రైళ్లలో ప్రయాణిస్తే ఛార్జీలో రాయితీ. బ్యాంకుల్లో దాచుకున్న సొమ్ముకు అధిక వడ్డీ ఇలా ఎన్నో ఎన్నెన్నో... కుర్రాణ్ణని చెప్పి రేపు నువ్వు వీటన్నిటినీ వదులుకోగలవా? చూడు మల్లేష్... బాల్యం, యవ్వనం, కౌమారం, వృద్ధాప్యం అనేవి వ్యక్తి జీవితంలో దశలు. వీటన్నిటిని అనుభవించిననాడే జీవితం పరిపూర్ణమౌతుంది. సాధ్యపడదని తెలిసినా ఎల్లకాలం కృత్రిమవేషంతో నవయువకుడిలా కనిపించాలనుకోవడం అవివేకం" అంటూ క్లాసు పీకారు.

హెచ్.ఎమ్‌గారి హితోపదేశంతో కనువిప్పింది మల్లేషుకి. అంతే, నాటినుండి మళ్ళీ కుర్రచేష్టల జోలికి పోతే ఒట్టు.

"హమ్మయ్య!" అనుకుని ఊపిరి పీల్చుకుంది మంగతాయారు,.

(జనవరి 2012 స్వప్న మాసపత్రిక)